క్లుప్తంగా

బకాయిలు ఇప్పించండి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఇల్లెందు: సింగరేణి మాజీ ఉద్యోగులకు సంస్థ నుంచి విడుదల చేయాల్సిన బకాయిలను తక్షణం ఇప్పించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ సింగరేణి ఉద్యోగులు వేడుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కనగాల పేరయ్య, ఇమామ్, సకినాల రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చైర్‌పర్సన్‌కు సన్మానం



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

నవభారత్: కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ అవిశ్వాస తీర్మానంలో నెగ్గి మొదటిసారి మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం అడుగు పెట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మికి కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ మాట్లాడుతూ.. ఎప్పుడైనా న్యాయం గెలుస్తుందని, కౌన్సిలర్లు న్యాయం వైపు ఉండటం వల్ల అవిశ్వాసం వీగిపోయిందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) కాన్ఫరెన్స్ పోస్టర్లను బుధవారం బాధ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ... ఖమ్మంలో ఈ నెల 24వ తేదీన సెమినార్ జరుగుతుందని ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్టులుగా రిటైర్డ్ హైకోర్టు జస్టిస్ బి.చంద్రకుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పోట్ల మాధవరావులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బాగం మాధవరావు, వీవీ సుధాకర్‌రావు, జీవీ హరిప్రసాద్, దుండ్ర రమేష్, మనుబోతుల సత్యనారాయణ, కోటం రాజు, కీలారు పురుషోత్తం, మెండు రాజమల్లు, రామారావు పాల్గొన్నారు.

సహకార సంఘం డైరీ..



సహకార సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార సంఘం 2024 డైరీని బుధవారం జిల్లా సహకార సంఘం అధికారి సయ్యద్ ఖుర్షీద్ కొత్తగూడెంలోని డీఆర్‌డీఏ (పాత) కార్యాలయంలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. డైరీ డిపార్ట్‌మెంట్ హుందాతనం తెలుపుతుందన్నారు. సహకార శాఖ అన్నిరంగాల్లో ముందుందని జిల్లా అడ్మినిస్ట్రేషన్‌లో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తన పరిపాలనతో ప్రతిష్టాత్మకంగా మరింత ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉమ్మడి జిల్లాల నుంచి రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావుకు కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. టీసీజీఓ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, ఎస్.సుబ్బారావు, టీజీఓ కార్యదర్శి విజయ్‌కుమార్, సోమయ్య, సహకారశాఖ అధికారులు, సంఘం కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలు, పండ్లు పంపిణీ

ఇల్లెందు: మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ లాకావత్ లక్ష్మీనారాయణ నాయక్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో పాలు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దోని, పండు, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతల జాతర ప్రారంభం

- తొలిరోజు గద్దెనెక్కిన సారలమ్మ
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం గద్దెల సమీప గ్రామాల నుంచి బోనాలతో తరలివస్తున్న భక్తులు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో సమ్మక్క–సారలమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచే భక్తులు గద్దెల వద్దకు చేరుకోవడంతో జాతర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సంప్రదాయబద్ధంగా సమీప గ్రామాల నుంచి మహిళలు బోనాలతో తరలివచ్చి వనదేవతల మూల విగ్రహానికి నైవేద్యం సమర్పించారు. ఆ సమయంలో పలువురిని వనదేవతలు ఆవహించడంతో వారి పలుకులను ఆలకించేందుకు భక్తులు జాతర ప్రాంగణంలో బారులుతీరారు. బుధవారం సాయంత్రం బొజ్జాయిగూడెం సమీపంలోని అడవిలో నుంచి సారలమ్మను డప్పు వాయిద్యాల నడుమ భారీ ప్రదర్శనతో తీసుకొచ్చి గద్దెను ఎక్కించారు. భక్తులు గద్దెల వద్దకు చేరుకొని సారలమ్మకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యంగా బంగారం (బెల్లం) సమర్పించారు. మేకలు, కోళ్లను వనదేవతల గద్దెల ముందు ఉంచి నైవేద్యంగా సమర్పించేందుకు ఆన ఇవ్వాలని వేడుకున్నారు.

పోటెత్తిన భక్తులు...

బొజ్జాయిగూడెంలో జాతర ప్రారంభానికి పక్షం రోజుల ముందు నుంచే భక్తజనం పోటెత్తారు. మేడారం జాతరను మరిపించేలా కొనసాగుతున్న బొజ్జాయిగూడెం వనదేవతల జాతరకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. జాతర ప్రాంగణంలో, సమీప అటవీ ప్రాంతంలో గుడారాలతో విడిది ఏర్పాటు చేసుకున్నారు. దీంతో గద్దెల ప్రాంతమంతా సందడి నెలకొంది. బొజ్జాయిగూడెం జాతర ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో వాహనాల రద్దీ అధికమైంది. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహక కమిటీ, పోలీసులు రక్షణ చర్యలు తీసుకున్నారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయాలు జోరందుకున్నాయి. భక్తులు అంచనాకు మించి రావడంతో నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరయ్యారు.

సహాయక చర్యల్లో అధికారులు...

బొజ్జాయిగూడెం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో పలు ప్రభుత్వ శాఖల అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ప్రత్యేకంగా పోలీసు శాఖ సిబ్బంది ప్రధాన రహదారిపై జాగ్రత్తలు తీసుకున్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ సిబ్బందితో పారిశుద్ధ్యం మెరుగుపర్చడంతోపాటు నీటి వసతి కల్పించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు చేసిన జీఎం జాన్‌ఆనంద్...

ఇల్లెందు: పట్టణంలోని సంజయ్‌నగర్ జేకే నంది మేడారం జాతర ప్రారంభం అయింది. బుధవారం సింగరేణి జీఎం జాన్‌ఆనంద్ గద్దెలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాలతో జీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. జీఎం మాట్లాడుతూ.. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకుని మొక్కలు చెల్లించుకోవాలని, భక్తులు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. సమ్మక్క– సారక్క తల్లులు ప్రజలను చల్లంగా చూడాలని, సింగరేణి సంస్థ, కార్మికులు, అధికారులు సంస్థ పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పోషం నాగేశ్వరరావు, రాములు, ప్రమోద్ ఉన్నారు.

వనదేవత చెంతకు పూజారులు, గిరిజన వడ్డెలు..

ఇల్లెందు జేకే నంది మేడారంలో వనదేవత చెంతకు పసుపు కుంకుమ, బోనంతో వడ్డెలు, పూజారులు బయలు దేరారు. బుధవారం సాయంత్రం సారక్క ఆగమనానికి ముందు వారు సంప్రదాయ పద్ధతుల్లో గంగా స్నానాలు ఆచరించి బోనం, పసుపు కుంకుమతో జేకే నుంచి గద్దెకు బయలు దేరారు. బోనంతో బయలు దేరిన వడ్డెలకు, పూజారులు మేళ తాలాలతో, డోలు వాయిద్యాలతో బయలుదేరగా పసుపు, కుంకుమతో గద్దెలకు చేరుకున్న అనంతరం వడ్డెలు, పూజారులు వనంలోకి వెళ్లి కోరగుట్ట నుంచి సారక్కను గద్దె మీదకు తీసుకొచ్చారు. భక్తులు ఎదురెళ్లి దేవతలను దర్శించుకున్నారు. శివసత్తువల పూనకాలతో గద్దెల ప్రాంతం మార్మోగింది.

టేకులపల్లి: సమ్మక్క సారక్క జాతర వేడుకలు బుధవారం టేకులపల్లి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లి, జండాలతండా, కోయగూడెం, నర్సాయిగూడెం, ముర్రుట్ల, రామచంద్రునిపేట తదితర గ్రామాల్లో సారలమ్మ గద్దెల వద్దకు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్, రామవరం (2 ఇంక్‌లైన్ వద్ద), గరీబ్‌పేట ప్రాంతాలలో శ్రీశ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరలో భాగంగా మొదటిరోజు బుధవారం సాయంత్రం ఆటపాటలతో, కొమ్ము డప్పులతో, దరువు చప్పుళ్లతో కోయ పూజారులచే సారలమ్మను గద్దెనెక్కించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న కార్మిక కుటుంబీకులు, స్థానిక భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో గద్దెల వద్ద లైటింగ్, మంచినటి వసతి ఏర్పాటు చేశారు.



ఇల్లెందురూరల్: పూజలు చేస్తున్న భక్తులు



టేకులపల్లి: జెండాల తండా వద్ద సారలమ్మను తీసుకొస్తున్న దృశ్యం



ఇల్లెందు: జేకే నందిమేడారం వన దేవతల గద్దెల వద్ద పూజలు చేస్తున్న జీఎం జాన్‌ఆనంద్



ఇల్లెందురూరల్: బంగారం (బెల్లం)తో తరలివస్తున్న భక్తులు



ఇల్లెందురూరల్: సారలమ్మను గద్దెల మీదకు చేరుస్తున్న పూజారులు



సింగరేణి(కొత్తగూడెం): గౌతంపూర్‌లో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



వనదేవతల వద్ద మేకలతో భక్తులు

‘ఉపాధి’ పనులు కల్పించకపోతే చర్యలు

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించకపోతే చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీఆర్‌డీఓ రవి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రతీ గ్రామపంచాయతీలో 50మందికి తగ్గకుండా కూలీలకు పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీరోజు రూ.272 వేతనం వచ్చే విధంగా మార్కింగ్ ఇచ్చి పనులు చేయించాలని చెప్పారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నర్సరీలలో షెడ్ నెట్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నారాయణ, ఏపీఓ పోరండ్ల రంగా, ఇరిగేషన్ ఏఈ నీలావతి, ఈసీ పుల్లయ్య పాల్గొన్నారు.

మండలంలో నర్సరీల సందర్శన

జూలూరుపాడు: మాచినేనిపేటతండా, జూలూరుపాడు నర్సరీలను బుధవారం డీఆర్డీఓ విద్యాచందన ఆకస్మికంగా సందర్శించారు. వేసవి దృష్ట్యా షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని జీపీ సెక్రటరీలను ఆదేశించారు. అదేవిధంగా జూలూరుపాడు కప్పల కుంట చెరువు పూడికతీత పనులను డీఆర్డీఓ పరిశీలించారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన మార్కింగ్ ప్రకారం పనిచేయాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెంచాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, జీపీ సెక్రటరీలు సునీత, జ్యోతి, టీఏలు జోదాబాయి, ప్రసాద్, ఎఫ్ఏ మూడ్ రమేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మాచినేనిపేట తండా నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

జీపీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక



ఇల్లెందురూరల్: ఎంపీడీఓకు కమిటీ వివరాలు అందజేస్తున్న కార్యదర్శులు



సందీప్‌కుమార్, అధ్యక్షుడు



లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి

ఇల్లెందురూరల్: తెలంగాణ గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఎండీ అజహర్ ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు బుధవారం సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా టి.యాకరాజు, ఉపాధ్యక్షుడిగా భూక్యా కిరణ్, కోశాధికారిగా పి.ప్రదీప్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవిలను కలిసి నూతన కమిటీ వివరాలను తెలియచేశారు.

టేకులపల్లి: టేకులపల్లి మండల గ్రామ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) టేకులపల్లి పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ (టీపీఎస్ఎఫ్) మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో కార్యదర్శుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా బంగారు సందీప్ కుమార్ (రాంపురం కార్యదర్శి), ప్రధాన కార్యదర్శిగా ఈర్ల లక్ష్మీనారాయణ (ప్రెగళ్లపాడు కార్యదర్శి), ఉపాధ్యక్షురాలిగా వీరమాస్ దీప్తి (చింతోనిచెలక కార్యదర్శి), కోశాధికారిగా సీహెచ్ శ్రీహరి (గంగారం కార్యదర్శి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పిట్ కార్యదర్శిగా మధుకృష్ణ



సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పిట్ కార్యదర్శిగా మామిడిపల్లి మధుకృష్ణను నియమించినట్లు ఆ యూనియన్ ఏరియా బ్రాంచి కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్‌రావు తెలిపారు. బుధవారం వర్క్‌షాపులో మాట్లాడుతూ... గత డిసెంబర్‌లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలుపొందిన క్రమంలో మైన్స్ డిపార్ట్‌మెంట్, పిట్ సేఫ్టీ, టెంపుల్ వర్క్‌మెన్ సేఫ్టీ, తదితర కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని దానిలో భాగంగా ఏరియా వర్క్‌షాపు పిట్ కమిటీలు వేయటం జరిగిందన్నారు. వీరితోపాటు కమిటీ సభ్యులుగా బండగొరి ప్రసాద్, రాజేందర్, గుమ్మడి మురళి, ఎం.సాంబశివరావు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లుగా ఎం.మనోజ్ (ఈఅండ్ఎం), బి.వెంకట్‌రామ్‌లను నియమిస్తూ అందుకు సంబంధించిన లేఖను వర్క్‌షాపు హెచ్ఓడీ టి.శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పిట్ కార్యదర్శిగా ఎన్నికైన మధు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టిన యూనియన్ నాయకులందరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

చెరువు కట్ట ఫెన్సింగ్ పనుల పరిశీలన

ఇల్లెందు: మంచినీటి చెరువు కట్ట రక్షణ కోసం డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన ఫెన్సింగ్ పనులను తక్షణం పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఫెన్సింగ్ పనులను పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. చెరువులోకి చెత్త చెదారం, పశువులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువు నీళ్లను మంచినీరుగా వాడుతున్నందున నీటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంటుందన్నారు.

వచ్చే వానాకాలం నాటికి పనులు ముగించాలన్నారు. మేనేజర్ అంకుషావలీ, ఏఈ కుమారస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): అభివృద్ధి పనులు పదికాలాలపాటు నిలిచి ఉండేలా నిర్మాణాలు చేపట్టాలని, నాణ్యతా లోపం ఉంటే ఉపేక్షించేది లేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రామవరం ఏరియా 7, 10 వార్డులలో రూ.కోటి డీఎంఎఫ్ నిధులతో నిర్మించనున్న ప్రధాన రహదారుల నిర్మాణ పనులకు బుధవారం కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ... పట్టణ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు, డ్రైయినేజీలు, కల్వర్టులు, ఇతర అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని, ప్రజలు సైతం నిర్మాణ పనులపై దృష్టి సారించి లోపాలుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఎస్‌కే సాబీర్‌పాషా, కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శేషాంజనేయస్వామి, డీఈ రవికుమార్, ఏఈ సాహితి, మునిగడప పద్మ, పులిగీత, కంచర్ల జమలయ్య, భుక్యా శ్రీను, మునిగడప వెంకటేశ్వర్లు, వంగా వెంకట్, బి.ఈశ్వరయ్య, పెయ్యాల రంగారావు, ఎస్‌కే రహీమ్, ఖయ్యూం, గోపాల్, జి.శ్రీనివాస్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు మార్కెట్ నిర్మించండి

కార్మిక ప్రాంతమైన రామవరంలో శిథిలావస్థలో ఉన్న పాత సింగరేణి సూపర్ మార్కెట్ స్థలంలో వీధి వ్యాపారులకు నాలుగు వైపులా షాపింగ్ కాంప్లెక్స్, మధ్యలో పార్కింగ్, పైన జాతీయ బ్యాంకు మంజూరు చేయించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ వినతిపత్రం అందజేశారు. బుధవారం రామవరంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయటానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి వీధి వ్యాపారుల సమస్యలను ఆమె ఎమ్మెల్యేకు వివరించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామవరం ప్రాంతం కార్మికులకు పుట్టినిల్లు, యూనియన్ నాయకుల పోరాటం వలన కార్మికులు అనేక హక్కులు సాధించుకున్నారని, రామవరం ప్రాంతమన్నా.. రామవరం ప్రజలన్నా తనకు ఎంతో అభిమానమని, నా గెలుపులో రామవరం ప్రజలు ప్రముఖ పాత్ర వహించారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఉన్నత శిఖరాలకు ఎదగాలి..



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు

ఇల్లెందు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకుని రావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సరస్వతీ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎండీ కాసీం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తోర్తి జాన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాషను రక్షించుకుందాం..



తెలుగు ఉపాధ్యాయిలను సన్మానిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మారుతున్న కాలంలో తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. లక్ష్మీదేవిపల్లిలోని సీఓఈ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు పి.మేరమ్మ, పి.కవిత, టి.ధనలక్ష్మిలను పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి నాగరికత, సంస్కృతి, సంప్రదాయ సముదాయనికి ఒక భాష ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఆరు వేలకుపైగా భాషలు ఉంటే.. మనుగడలో ఉన్నవి 500లోపే ఉన్నట్లు చెప్పారు. మన మాతృ భాష తెలుగును కోల్పోతే ఉనికిని కోల్పోయినట్లేనన్నారు. నేడు మనం మాట్లాడే ప్రతి పదంలో రెండు నుంచి నాలుగు దాకా ఇంగ్లిష్ లేదా అన్యభాషల పదాలే ఉంటున్నాయని చెప్పారు. ప్రపంచంతో అనుసంధానానికి ఇంగ్లిష్ తదితర భాషలు కావాలిందే కానీ, మన అస్తిత్వాన్ని కాపాడేది మాతృభాష మాత్రమేనన్నారు. మన పిల్లలు ఏ మీడియాలో చదివినా ఫర్వాలేదు కానీ, మన భాషను మరవకుండా చూడాలి. తెలుగు భాషను భావితరాలకు అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, గురుకుల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణ, పి.పుల్లారెడ్డి, మోహన్, నాగేశ్వరరావు, సతీష్, రాంబాబు, సుమన్, లక్ష్మా, ఎంవీ రెడ్డి, శ్యామ్‌సన్, సుభాషిణి, దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వరలక్ష్మి

పాల్వంచరూరల్: మారుతున్న సమాజంలో అందరికీ సుఖవ్యాధులపై అవగాహన ఉండాలని వైఆర్‌జీ కేర్ వర్కర్ బి.వరలక్ష్మి అన్నారు. మండల పరిధి పాండురంగాపురం గ్రామంలో బుధవారం హెచ్ఐవీ, టీబీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... హెచ్‌ఐవీ వైరస్ మానవశరీరంలో ఉందా లేదా అని తెలుసుకోవాలంటే రక్త పరీక్షల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అసురక్షిత లైంగిక సంబంధం, కలుషితమైన సిరంజిలు, కలుషితమైన రక్తమార్పిడి ద్వారానే ఈ వైరస్ మానవ శరీరంలో ప్రవేశిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. హెచ్ఐవీకి భయపడాల్సిన అవసరం లేదని అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రభాకర్, సీహెచ్ఓ శరణ్య, హెల్త్ సూపర్‌వైజర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

చుంచుపల్లి: మండలంలోని విద్యానగర్ పంచాయతీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, అక్రమ పద్ధతిలో ఇంటి నంబర్ పొంది నిర్మాణాలు చేపడుతున్న ఓ పార్టీ జిల్లా అధ్యక్షుడుపై చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యానగర్ కాలనీ పంచాయతీలో సుమారు రూ.10 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి పంచాయతీ రాజ్ చట్టాలకు, ఇరిగేషన్ శాఖ, ఏజెన్సీ నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేదుతున్నారని ఆరోపించారు. నెల రోజులుగా పంచాయతీ కార్యదర్శి మొదలు కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రధాన జాతీయ రహదారిపై బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



ఇల్లెందురూరల్: ఇల్లెందు నుంచి రాఘబోయినగూడెంకు వెళ్లే మార్గంలో టెలీకమ్యూనికేషన్ విభాగానికి చెందిన కేబుల్ పరిచేందుకు ఆర్ అండ్‌బీ రోడ్డు వెంబడి గోతులు తవ్వారు. కానీ పక్షం రోజులుగా ఊడ్చకుండా అలాగే వదిలేశారు. పనులు ముగించుకొని కాంట్రాక్టర్ కూడా వెళ్లిపోవడంతో పూడ్చేవారు లేక ఆ గుంత ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : మోతీలాల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఇల్లెందు మండలం
సెల్ నంబర్ : 9908132379

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148